TGTEL/25/A0977

# తొవ్వ

స్వాగతం

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 357 | ఆదివారం 3-08-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 2 | వెల : 5 రూ/.

## నాలాల్లో ఆటంకాలు ఉండొద్దు..

**- హైడ్రా కమిషనర్ రంగనాథ్**

**హైదరాబాద్ సిటీ:** వరదనీరు సున్నం చెరువులో కలిసేలా మురుగునీరు కిందకు పోయేలా నాలాల నిర్మాణం ఉండాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులకు సూచించారు. బోరబండ, సున్నం చెరువు ప్రాంతాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. అల్లాపూర్, బోరబండ డివిజన్లను కలుపుతూ సాగే నాలాలను విస్తరించాలన్నారు. పద్మావతినగర్ వద్ద నాలాను ఆక్రమించి ఇటీవల నిర్మించిన షెడ్లను తొలగించాలని స్థానికులు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. బోరబండ మీదుగా హైటెన్షన్ రోడ్డులో ఆక్రమణలను ఆయనకు చూపించారు. నిబంధనల ప్రకారం ఆక్రమణలను తొలగించి రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ సూచించారు. అనంతరం బండ్లగూడ, జలపల్లి పరిసరాల్లోని పెద్దచెరువు, హుందాసాగర్ చెరువులను పరిశీలించారు. డ్రోన్ ఎగురవేసి మొత్తం చెరువు స్వరూపాన్ని చిత్రీకరించాలన్నారు.

## మంత్రి కొండా సురేఖకు బిగ్ షాక్..

**కేసు నమోదు చేయాలని నాంపల్లి కోర్టు కీలక ఆదేశాలు**



హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు వేసిన పరువునష్టం దావా కేసులో మంత్రి కొండా సురేఖ కు నాంపల్లి కోర్టు షాక్ ఇచ్చింది. మంత్రి కొండాపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని నాంపల్లి కోర్టు ఆదేశించింది. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్‌తోపాటు నటి సమంత విడాకుల వ్యవహారంలో కేటీఆర్‌పై నిరాధార ఆరోపణలు చేసిన మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. ప్రాథమిక సాక్ష్యాలను పరిశీలించిన నేపథ్యంలో నిందితురాలు కొండా సురేఖపై ఈ నెల (ఆగస్టు) 21వ తేదీ లోపు క్రిమినల్ కేసు నమోదు చేసి ఆమెకు నోటీసు జారీ చేయాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. కేటీఆర్‌పైన కొండా సురేఖ నిరాధారమైన ఆరోపణలు చేశారని కేటీఆర్ న్యాయవాది వాదనలతో కోర్టు ఏకీభవించింది. ఫిర్యాదుతోపాటు సాక్షుల వాంగ్మూలాలు, డాక్యుమెంట్లు పరిశీలించిన తర్వాత, నిందితురాలు కొండా సురేఖపై ప్రాథమిక కేసు ఉన్నట్లు నాంపల్లి కోర్టు గుర్తించింది.

## ఐవీఎఫ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

**మంత్రి దామోదర్ కీలక ఆదేశాలు**



హైదరాబాద్: మాతృత్వం కోసం తపిస్తున్న దంపతుల ఆశను ఆసరాగా చేసుకుని, ఐవీఎఫ్, సరోగసీని వ్యాపారంగా మార్చి దందాకు పాల్పడుతున్న ఐవీఎఫ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. సృష్టి తరహా ఘటనలు పునరావృతం అవకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐవీఎఫ్ క్లినిక్‌లలో తనిఖీలు, నియంత్రణ కోసం ఉన్నతాధికారులతో కమిటీని నియమించాలని హెల్త్ సెక్రటరీకి సూచించారు మంత్రి దామోదర్ రాజనర్సింహ. ఈ మేరకు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ నేతృత్వంలో ఆరోగ్యశ్రీ సీఈవో, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ సభ్యులుగా కమిటీని నియమిస్తూ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ నేతృత్వంలో ప్రైవేటు ఐవీఎఫ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఆయా సెంటర్లపై ఇదివరకే నమోదైన కేసుల వివరాలు సేకరించాలని సూచించారు. ఆయా సెంటర్ల అనుమతులు, రిజిస్ట్రేషన్ల వ్యాలిడిటీ వంటి అంశాలను పరిశీలించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను పది రోజుల్లో పూర్తి చేసి, నివేదిక అందించాలని ఈ కమిటీని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు.

## కాంగ్రెస్ మాత్రమే మోదీని కుర్చీ నుంచి దింపగలదు..

**రేవంత్‌రెడ్డి**



ఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ తన కుర్చీ వదులుకోవడానికి సిద్ధంగా లేరని విమర్శించారు. 75 ఏళ్లు నిండిన వారిని పదవి నుంచి వైదొలగాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ చెప్పినా మోదీ ఎందుకు వినడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. 2001 నుంచి మోదీ కుర్చీ ఎందుకు వదలడం లేదని ప్రశ్నించారు రేవంత్ రెడ్డి. అద్వానీ, మురళీ మనోహర్‌జోషికి వర్తించిన వయసు మోదీకి వర్తించదా? అని నిలదీశారు. మోదీని వచ్చే ఎన్నికల్లో కుర్చీ నుంచి దించేది రాహుల్ గాంధీ మాత్రమేనని ఉద్ఘాటించారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ నేతృత్వంలో మోదీని ఓడిస్తామని హెచ్చరించారు. మోదీని ఓడిస్తాం, దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుతామని ఉద్ఘాటించారు. ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటిస్తున్నారు. శనివారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ వార్షిక న్యాయ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. దేశానికి రాజ్యాంగాన్ని ఇచ్చింది కాంగ్రెస్ అని సీఎం రేవంత్‌రెడ్డి నొక్కిచెప్పారు. సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న పార్టీ కాంగ్రెస్ అని అభివర్ణించారు. బీజేపీతో సహా అన్ని పార్టీలూ అధికారంలో లేకపోతే ఇంటికే పరిమితమని విమర్శించారు. అధికారంలో ఉన్నా లేకున్నా కాంగ్రెస్‌ది ప్రజాపక్షమేనని ఉద్ఘాటించారు. పాకిస్థాన్‌పై యుద్ధం చేసి తూర్పు పాకిస్థాన్‌ని విడదీసింది కాంగ్రెస్ అని గుర్తుచేశారు. దేశం కోసం తన ప్రాణాన్ని కూడా ఇందిరాగాంధీ త్యాగం చేశారని కొనియాడారు. స్వాతంత్ర్యం రాకముందే కాంగ్రెస్ పార్టీ ఉందని తెలిపారు. బీజేపీ నేతలకు గుర్తు చేస్తున్నా.. బ్రిటిష్ వాళ్లతో పోరాడి స్వాతంత్ర్యం తీసుకొచ్చిందే కాంగ్రెస్సే అని ఉద్ఘాటించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇందిరాగాంధీ పాకిస్థాన్‌పై యుద్ధం ప్రకటించి పాకిస్థాన్‌ను రెండు ముక్కలు చేసి కాళీకామాత అవతారం ఎత్తారని చెప్పుకొచ్చారు. ఉగ్రవాదుల నుంచి దేశాన్ని ఇందిరాగాంధీ రక్షించారని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ ఉగ్రవాదుల పోరులో మరణించారని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో మోదీ, బీజేపీని కాంగ్రెస్ ఓడిస్తుందని తెలిపారు. 2004 ఎన్నికల్లో కేంద్రంలో అధికారంలోకి కాంగ్రెస్ వచ్చినా సోనియాగాంధీ ప్రధాని పదవి తీసుకోలేదని గుర్తుచేశారు. ప్రధాని పదవిని త్యాగం చేసిన ఘనత సోనియాగాంధీదని ప్రశంసించారు. రాహుల్‌గాంధీ ప్రధాని కావాలనుకుంటే ఎప్పుడో అయ్యేవారని చెప్పుకొచ్చారు సీఎం రేవంత్‌రెడ్డి. దేశవ్యాప్తంగా తెలంగాణ మోడల్ అమలు చేసి చూపిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశామని తెలిపారు. రాహుల్‌ను ప్రధానిని చేసేవరకు కాంగ్రెస్ శ్రేణులు కలిసి పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, రాజ్యాంగాన్ని కాపాడే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందని నొక్కిచెప్పారు. సామాజిక న్యాయం కోసం కేంద్రప్రభుత్వం ప్రయత్నం చేయడం లేదని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ 150 సీట్లకు మించి గెలవదని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అంతా రాహుల్ గాంధీ వెంట ఉంటారని ఉద్ఘాటించారు. మోదీ నుంచి దేశాన్ని రక్షిస్తామని తెలిపారు. దేశానికి రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ప్రభుత్వ సొమ్ము తిన్నవాళ్లను తిరిగి కక్కిస్తాం..

**మహేష్ గౌడ్ స్ట్రాంగ్ వార్నింగ్**



సంగారెడ్డి: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. కేసీఆర్ దోషి అని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చెప్పిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల రూపాయలు వృథా చేసి తెలంగాణను కేసీఆర్ అప్పులపాలు చేశారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తేల్చి చెప్పిందని అన్నారు. ఇంజనీర్లు చెప్పింది కేసీఆర్ వినకుండా తన సొంత లాభం మాత్రమే చూసుకున్నారని విమర్శించారు. శనివారం ఆందోలు మండలం సంగుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. తనకి ఇష్టం ఉన్న చోట కాళేశ్వరం ప్రాజెక్టు కట్టాలని కేసీఆర్ ఆదేశాలు ఇచ్చారని చెప్పుకొచ్చారు. రెండే పిల్లర్లు కుంగాయని బీఆర్ఎస్ నేతలు అంటున్నారని...ఇది సామాన్య విషయమా..? అని ప్రశ్నించారు. ఫార్ములా ఈ కారు రేస్‌లో మాజీ మంత్రి కేటీఆర్ అవినీతికి పాల్పడలేదా..? అని నిలదీశారు.

## ఇంటింటికీ సంస్కృతం చేరాలి



**నాగ్‌పూర్, ఆగస్టు 2:** భారతదేశంలోని అన్ని భాషలకు సంస్కృతం మూలమని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. ఈ భాష దేశవ్యాప్తంగా ప్రతి ఇంటికీ చేరాలని, అందరూ సంస్కృతంలో మాట్లాడుకునేలా ఉండాలని ఆకాంక్షించారు. శుక్రవారం నాగపూర్‌లోని కవి కులగురు కాళిదాస్ సంస్కృత విశ్వవిద్యాలయంలో నిర్మించిన అభివన భారతి అంతర్జాతీయ విద్యా భవనం ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. సంస్కృతం మరింత అభివృద్ధి చెందాలంటే ప్రజలు తమ దైనందిన జీవితంలో వాడుక భాషగా ఉపయోగించాలని సూచించారు. మన నిజమైన గుర్తింపు భాషతోనే ముడిపడి ఉంటుందని పేర్కొన్నారు. సంస్కృతాన్ని తెలుసుకోవడమంటే దేశాన్ని అర్థం చేసుకున్నట్లేనని స్పష్టం చేశారు. ఈ ప్రాచీన భాషను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని భాగవత్ పిలుపునిచ్చారు.

## బనకచర్ల ప్రాజెక్టుకు మేము వ్యతిరేకం..

**ఎంతటి పోరాటానికి అయినా సిద్ధం**



హైదరాబాద్: పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టును తమ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. బనకచర్లపై ఏపీ మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యలు సరైనవి కావని తెలిపారు. లోకేష్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. పోలవరం బనకచర్లకు పర్యావరణ అనుమతి లేదని, వ్యతిరేకించిందని గుర్తుచేశారు. శనివారం తెలంగాణ సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిట్ చాట్ చేశారు. తానే స్వయంగా తన లెటర్ హెడ్‌పై కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశానని స్పష్టం చేశారు. బనకచర్లను ఆపేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని చెప్పుకొచ్చారు. బనకచర్లపై తమ స్టాండ్ క్లియర్‌గా ఉందని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని.. గులాబీ నేతలు పబ్లిసిటీ కోసం మాత్రమే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు జాగ్రత్తలు తీసుకుంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదని తెలిపారు. బీఆర్ఎస్ గాలి మాటలు తప్ప వాస్తవం లేదని విమర్శించారు. బనకచర్ల ప్రాజెక్టుకు తాము వ్యతిరేకమని.. ఎంతటి పోరాటానికి అయినా తాము సిద్ధమని ఉద్ఘాటించారు. కేంద్ర బీజేపీతో టీడీపీ పొత్తు ఉందని మంత్రి నారా లోకేష్ ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. పోలవరం బనకచర్ల ఇల్లీగల్ ప్రాజెక్టు అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు.

## అన్నాడీఎంకే కులమతాలకు అతీతం..

**- మాజీసీఎం ఈపీఎస్**



**చెన్నై:** అన్నాడీకేకు కులమతాల పట్టింపులేదని, అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం అందించాలన్నదే తమ పార్టీ లక్ష్యమని మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో చేపట్టిన తన ప్రచార యాత్రలో భాగంగా ఈపీఎస్ శుక్రవారం తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టి నియోజకవర్గంలో పర్యటించారు. ముందుగా సెన్బగవల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కోవిల్‌పట్టి ప్రాంతంలోని ఓ కల్యాణమండపంలో ఆయన క్రైస్తవ, ముస్లిం మత గురువులు, అగ్గిపెట్టె పరిశ్రమల యజమానులు, వేరుశనగ మిఠాయి ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సంఘాల తరుపున మాట్లాడిన ప్రతినిధులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. అనంతరం ఈపీఎస్ మాట్లాడుతూ, చిన్నా, మధ్య తరహా పరిశ్రమల సంఖ్య పెరిగితేనే నాణ్యమైన ఉత్పత్తితో పాటు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని, ఇందుకోసం మాజీ ముఖ్యమంత్రి జయలలిత ప్రభుత్వం, తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కులమతాలకు అతీతంగా వ్యవహరిస్తున్న అన్నాడీఎంకే గతంలో అధికారంలో ఉన్న సమయంలో రంజాన్ మాసంలో ఇఫ్తార్ గంజికి అవసరమైన బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు, హజ్ యాత్రకు నిధులు అందజేశామని, మైనారిటీల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మొక్కజొన్న, పత్తి, అగ్గిపెట్టెలు, వేరుశనగ మిఠాయి పరిశ్రమల అభివృద్ధికి అన్నాడీఎంకే అండగా ఉంటుందన్నారు.

## పీఎం కిసాన్ 20వ విడత నగదు విడుదల చేసిన ప్రధాని మోదీ..



**వారణాసి**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారణాసి నుంచి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన 20వ విడత మొత్తాన్ని విడుదల చేశారు. సేవాపురిలోని బనౌలిలో జరిగిన కార్యక్రమంలో ఈ విడతను అధికారికంగా రిలీజ్ చేశారు. ఈసారి దేశవ్యాప్తంగా 9.7 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ.20,000 కోట్లు బదిలీ అయ్యాయి. ఈ పథకం ద్వారా రైతులకు ఏడాదికి మూడు విడతల్లో రూ.6,000 ఆర్థిక సాయం అందుతుంది. అంటే, ఒక్కో విడతలో రూ.2,000 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ అవుతాయి. అంతకుముందు, జూన్ 18, 2024న, ప్రధానమంత్రి మోదీ నుంచి రూ.9.26 కోట్ల మంది రైతుల ఖాతాలకు సమ్మాన్ నిధిని రిలీజ్ చేశారు. పర్యటనలో భాగంగా వారణాసి పర్యటనలో భాగంగా మోదీ దాదాపు రూ.2,200 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతోపాటు శంకుస్థాపన చేశారు. వీటిలో రోడ్లు, ఆసుపత్రులు, స్కూళ్లు సహా రకరకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు వారణాసి ప్రజల జీవితాలను మరింత మెరుగుపరుచనున్నాయి. ఈ అభివృద్ధి ప్రాజెక్టులు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను కూడా పెంచబోతున్నాయని తెలిపారు. ఇలాంటి ప్రాజెక్టులు రైతుల జీవితాలు, గ్రామీణ భారతాన్ని మరింత బలోపేతం చేస్తాయన్నారు. మోదీ మాట్లాడుతూ, మీరు దేశానికి అన్నం పెట్టే అన్నదాతలు. మీ సంక్షేమం కోసం మేం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామన్నారు. రైతులకు నగదు విడుదల చేసిన సందర్భంగా మరో పథకం గురించి కూడా మోదీ ప్రస్తావించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన. ఈ పథకం ద్వారా పంటకు నష్టం జరిగితే బీమా సంస్థ పరిహారం ఇస్తుందని గుర్తు చేశారు. ఈ స్కీం ద్వారా ఇప్పటివరకు రైతులకు రూ.1.75 లక్షల కోట్లకు పైగా విలువైన క్లెయిమ్‌లు ఇచ్చినట్లు ప్రస్తావించారు. పంట బీమా తీసుకోని వారు వెంటనే తీసుకోవాలన్నారు.

## బీసీ రిజర్వేషన్‌లు తగ్గించేందుకు కాంగ్రెస్ కుట్ర..

**కిషన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు**



**హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం , తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో వందరోజుల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పిందని.. కానీ ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు అవుతున్న ఇంకా ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. రిజర్వేషన్‌లు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం, బీజేపీపై బట్టకాల్చి మీద వేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఇది బీసీ రిజర్వేషన్ల కోసం కాదని.. ముస్లింలకు మేలు చేసేదని విమర్శించారు. గతంలో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన రాష్ట్రం తెలంగాణ అని ఉద్ఘాటించారు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి. ఎంఐఎం చేతిలో కీలుబొమ్మగా ఉన్న కేసీఆర్ ముస్లింలకు 12శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లను 22 శాతానికి కుదించారని ఆరోపించారు. శనివారం ఇందిరా పార్క్ వద్ద బీజేపీ ధర్నా నిర్వహించింది. బీసీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ ప్రభుత్వ తీరును బీజేపీ నేతలు ఎండగట్టారు. బీజేపీ తెలంగాణ చీఫ్ రాంచందర్ రావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు , బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. గతంలో అమలైన 35 శాతం కంటే కూడా రెండు శాతం రిజర్వేషన్లు తగ్గించేలా కాంగ్రెస్ కుట్ర చేస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆక్షేపించారు. 20శాతం ఇళ్లలోకి వెళ్లి ఎందుకు సర్వే చేయలేదని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీలో జనాభా పెరిగిందని బీసీల జనాభా తగ్గిందని లెక్కలు చెబుతున్నారని తెలిపారు. 42 శాతం పూర్తిగా బీసీలకు రిజర్వేషన్లు దక్కాల్సిందేనని డిమాండ్ చేశారు. బీసీల మెడలు కోసేలా ముస్లింలకు రిజర్వేషన్‌లు ఇవ్వడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు న్యాయం చేసిన పార్టీ బీజేపీ మాత్రమేనని ఉద్ఘాటించారు. గత 70 ఏళ్లలో కుల గణన ఎందుకు చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కులగణన చేయని కాంగ్రెస్ తరఫున రాహుల్ గాంధీ పార్లమెంట్ ముందు ముక్కు నేలకు రాయాలని విమర్శించారు కిషన్‌రెడ్డి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ విషయంలో మార్పు వచ్చిందో సమాధానం చెప్పాలని కిషన్‌రెడ్డి నిలదీశారు. రాష్ట్రంలో ముస్లింలకు అమలవుతున్న 4శాతం రిజర్వేషన్‌లు తొలగించి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు కింద ముస్లిం, క్రిస్టియన్‌లకు రిజర్వేషన్‌లు కల్పిస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఈ విషయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. తెలంగాణ ఏ విషయం లో ఆదర్శమో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ దేశ ప్రజలను మభ్యపెట్టేలా వ్యవహరిస్తున్నారని ఫైర్ అయ్యారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి మాయలో మనం పడకూడదని సూచించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం అన్ని బీసీ సంఘాలు పోరాటం చేయాలని కోరారు. బీసీలకు బీజేపీ అండగా ఉంటుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా తిరుప్పావడసేవా



తొవ్వ, నర్సింహులపేట, ఆగష్టు. 02

చిన్నతిరుపతిగా పేరుగాంచిన మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలకేంద్రంలోని ఇంద్రకీలాద్రి పై వెలసిన ఆకిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ శ్రీ శ్రీ అలివేలుమంగ పద్మావతీ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రెండవ సారి తిరుప్పావడ సేవా (అన్న కూటోత్సవం) కార్యక్రమం శ్రావణ మాసంలోని శనివారం రోజున అత్యంత వైభవంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆలయ కార్యానిర్వహాణాధి కారి వెంకట్రావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనందనాచార్యులు, రామా చార్యులు (రాంబాబు) వేద మంత్రోచరణల మధ్య ప్రత్యేక పూజలు , అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి చక్కెర పొంగిలి, దద్దోజనం, పులిహోరతో పాటు పలు రకాల తీర్థప్రసాదాలు తయారు చేసి , స్వామి వారి మూలవిరాట్ , అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పలు రకాల పూలమాలతో, తులసీ మాలలతో అలకరించి తిరుప్పావడ సేవా (అన్నకూటోత్సవం) కార్యక్రమంఅంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్య వైశ్యులు , భక్తులు, గ్రామస్థులు పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ మార్క శేఖర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# Sr ప్రైమ్ స్కూల్ ప్రతిభను గుర్తించిన ఘనత వేడుక

### IIT Prime Test లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు జోనల్ హెడ్ చేతుల మీదుగా అభినందన పత్రాల ప్రదానం

**ఖమ్మం తొవ్వ ఆగస్ట్ 2:**

ఖమ్మం పట్టణంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థ Sr Prime School లో విద్యార్థుల ప్రతిభను గుర్తిస్తూ అభినందన పత్రాల ప్రదాన కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జోనల్ హెడ్ భాస్కర్ రెడ్డి, డీజీఎం G.L.R విచ్చేసి, విద్యార్థులకు స్వయంగా అభినందన పత్రాలు (Appreciation Certificates) అందించారు. కార్యక్రమంలో స్కూల్ అధ్యాపక సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ అభినందన పత్రాలు జూలై 19న నిర్వహించిన »»IT Prime Test" లో అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు అందజేయబడ్డాయి. పరీక్షలో ప్రథమ (1st Rank) మరియు ద్వితీయ (2nd Rank) స్థానాల్లో నిలిచిన విద్యార్థులను వేదికపై సన్మానించారు. వారి కృషిని ప్రశంసిస్తూ, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జోనల్ హెడ్ మాట్లాడుతూ "ఈ పరీక్షలో విజయం సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో IITల వంటి అత్యున్నత స్థాయిలో విద్య పొందగలరనే నమ్మకం ఉంది. మీరు చూపిన అంకితభావం అభినందనీయం." అని పేర్కొన్నారు. DGM మాట్లాడుతూ ఇది ఒక సాధారణ పరీక్ష కాదు, భవిష్యత్తు విజేతల్ని గుర్తించే పరీక్ష. ఈ చిన్నదైన వేదికల నుంచే పెద్ద విజయం

**ప్రారంభమవుతుందన్నారు"**

ఉపాధ్యాయులు మాట్లాడుతూ:"పాఠశాల తలపెట్టిన ఈ పరీక్ష విద్యార్థుల నిజమైన సామర్థ్యాన్ని బయటపెట్టింది. మా పిల్లల ప్రతిభను గుర్తించినందుకు ధన్యవాదాలు." అన్నారు. ప్రిన్సిపల్ గారు విద్యార్థులను ఉద్దేశించి ఇది మీరు మొదటి మెట్టులో ఉన్నారని గుర్తించండి. ముందుగా ఇంకా దూరంగా సాగాలంటే దీని నుంచి ప్రేరణ తీసుకొని చదువులో ఇంకా నిబద్ధత పెంచుకోవాలి" అని హితవు పలికారు. కార్యక్రమం ముగింపులో విజేతలకు ఫోటో సెషన్, బ్యాడ్జిల పంపిణీ మరియు ఉత్సాహభరిత సంబరాలు




కొనసాగాయి. విద్యార్థులు సంతోషంగా స్పందిస్తూ ఇది మాకు మరింత శ్రమించడానికి బలమైన ప్రేరణ. వచ్చే సారి మేమే మొదటి స్థానంలో ఉండాలనే సంకల్పం కలిగింది." అన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో పోటీ మనోభావాన్ని, తమ సామర్థ్యంపై నమ్మకాన్ని పెంచేలా నిలిచింది. Sr Prime School విద్యార్థులకు ఇది ఒక మరపురాని రోజు అయింది.

# ఆగస్టు 4న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

- సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్
- ఓసి క్లబ్ ను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే వరకు పోరాటం ఆగదు
- అడ్వకేట్స్ జేఏసీ కన్స్యూమర్ ఫోరం, లెక్చరర్స్ ఫోరం సంఘీభావం



**తొవ్వ, మహబూబాబాద్ ప్రతినిధి, ఆగష్టు 02**

ఆగష్టు 4న కలెక్టరేట్ ముట్టడి జయప్రదం చేయాలని సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ సారధి రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రిలే నిరాహార దీక్ష ను ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి బి. విజయ సారథి ప్రసంగించారు .భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో ఓసి క్లబ్ ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని గత 3 మూడు రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలు చివరి రోజు సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రారంభించి అనంతరం బి విజయ సారథి మాట్లాడుతూ... ఓసి క్లబ్ ప్రభుత్వం సాధించుకునేంత వరకు సిపిఐ పోరాటం ఆగదన్నారు. ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి పెంచేందుకే ఆగస్టు 4 న సిపిఐ చలో కలెక్టరేట్ ముట్టడిని చేస్తున్నామని తెలిపారు. ఈ కలెక్టరేట్ ముట్టడికి వందలాదిగా సిపిఐ శ్రేణులు, ఈ ప్రాంత ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. మానుకోట ఎమ్మెల్యే మురళి నాయక్, ఎంపీ బలరాం నాయక్ చొరవచూపి ప్రభుత్వంతో మాట్లాడి క్లబ్ ను స్వాదినం చేసుకునే ప్రయత్నం చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ దృష్టికి గతంలో తీసుకువెళ్లామని ఇప్పటికైనా కలెక్టర్, అధికారులు ఓసి క్లబ్ ను స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. స్వాధీనం చేసుకొని బహుళ ప్రయోజనాల కోసం ఉపయోగించాలని, ఈ ప్రాంతంలో ప్రజలు కోరుకుంటున్నారన్నారని అన్నారు. ఎడ్యుకేషనల్ హబ్, కళాక్షేత్రం, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఇలాంటివి యువతీ యువకులు, క్రీడాకారులకు ఉపయోగపడే రీతిన స్వాధీనం చేసుకొని నిర్మించాలని తెలిపారు. ఈ సందర్భంగా రిలే దీక్షలకు మద్దతు తెలిపిన కన్స్యూమర్ ఫోరం నాయకుడు మైస శ్రీనివాస్, అడ్వకేట్స్ జేఏసీ నాయకుడు మామిడాల సత్యనారాయణ, లెక్చరర్స్ ఫోరం నాయకుడు నీలం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... సిపిఐ చేసే పోరాటాలు ప్రజల కోసమే అన్నారు. ఈ ప్రాంతంలో ప్రజల కోసం కొట్లాడేది సిపిఐ అన్నారు. సిపిఐ చలో కలెక్టరేట్ ముట్టడికి తమ మద్దతు తెలిపి పాల్గొంటామని తెలిపారు. బి. అజయ్ సారధి రెడ్డి నేతృత్వంలో ఈ ప్రాంతంలో ఉద్యమాలు ఉధృతంగా చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పెరుగు కుమార్, రేశ పల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిళ్ల సాంబలక్ష్మి, వీరవెల్లి రవి, నర్రా శ్రావణ్, మంద శంకర్, పురం భాగ్యలక్ష్మి, బేతమల్ల శ్రీనివాస్, తండా శ్రీనాథ్, భీమరాజు వెంకన్న, మంద శ్రీను, ఎండి రఫీ, ఏర్రోజు పద్మ, మిర్యాల మల్లికార్జున్, సుభద్ర, రాజు, గాదం శ్యాంప్రసాద్ యాదవ్, డి.రమేష్, పుల్లకండం రమేష్, భాష మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటి విద్యార్థిని గోలి సింధూజకు 35000/- వేల రూపాయల ఆర్థిక సహాయం

**తొవ్వ, ప్రతినిధి.ఆగస్ట్ 02**

సేవ వెల్ఫేర్ సొసైటీ, వరంగల్ వారి ఆధ్వర్యంలో ఐఐటి విద్యార్థిని గోలి సింధూజకు ముప్పై ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. అడ్వకేట్ కాలనీ లోని క్రేసన్ ట్రాస్ ఐటి సొల్యూషన్స్ కార్యాలయంలో నిర్వహించబడిన చేయూత కార్యక్రమం ద్వారా విద్యార్థిని తల్లి తండ్రులు గోలి కవిత బాబు గార్లకు సంస్థ వ్యవస్థాపకుడు జూపాక రత్న ప్రణయ్ చేతుల మీదుగా చెక్కును అందజేయడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా జూపాక రత్న ప్రణయ్ మాట్లాడుతూ వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామానికి చెందిన




విద్యార్థిని గోలి సింధూజ జెఈఈ అడ్వాన్స్ లో రాష్ట్ర స్థాయి లో రెండవ ర్యాంక్ సాధించి ఐఐటి హైదరాబాద్ లో సీటు సంపాదించు కోవడం చాలా గొప్ప విషయమని భవిష్యత్తులో ఇంకా ఉన్నతమైన స్థాయికి ఎదిగి తల్లి తండ్రులకు మంచి పేరును తీసుకురావాలని అందుకు మా సంస్థ తరపున విద్యార్థిని చదువుకు అవసరమైన స్టడీమెటీరియల్ కొరకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కోశాధికారి దూలం సందీప్ కమిటీ సభ్యులు అబ్దుల్ నయీమ్ క్రేసన్ ట్రాస్ ఐటి సొల్యూషన్స్ నిర్వహకులు శివప్రసాద్ రాజు రాము రాకేష్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు..

**సింగరేణిలో జరిగిన సాగున్యాయయాత్రలో ప్రసంగిస్తున్న రైతుసంక్షేమ కమీషన్ సభ్యులు, భూభారతి రూపకర్త భూమి సునీల్.., పాల్గొన్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి గోపాల్ రెడ్డి, అధికారులు, రైతులు..**



# కాసర్ల శ్యామ్‌కి ఫోన్ చేసి అభినందనలు తెలిపిన మాజీ మంత్రి ఎర్రబెల్లి




**తొవ్వ, ప్రతినిధి ఆగస్ట్ 03**

ఊరి పరిమళాన్ని యావత్ ప్రపంచానికి ఒక్క పాటతో వ్యాపింపచేసిన కాసర్ల శ్యామ్ మన వరంగల్ బిడ్డ కావటం మనం గర్వించదగ్గ విషయం అని 71th నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ లో 'ఊరు పల్లెటూరు' పాటకు గానూ కాసర్ల శ్యామ్ కి ఉత్తమ గేయ రచయిత అవార్డు వరించటం గొప్ప విషయం అని వారికి ఫోన్ చేసి అభినందనలు తెలిపారు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఇలాంటి పాటలు ఆయన కలం నుంచి మరెన్నో రావాలని అభిలాషించారు

# భావి తరాలకు స్ఫూర్తిదాయకం పింగళి వెంకయ్య

### -తిరుమల ప్రభాకర్ రెడ్డి



బయ్యారం,తొవ్వ,ఆగస్టు 2.

జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 1876,ఆగస్టు 2న కృష్ణాజిల్లా భట్లపెనుమర్రు లో జన్మించారు. ఈ క్రమంలో శనివారం పింగళి వెంకయ్య 149వ జయంతి సందర్భంగా ఆ మహనీ యునికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖులు ఘన నివాళులు అర్పించారు. ఈ నేపథ్యంలో జాతీయ పతాక రూపకర్త, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి కాంగ్రెస్ నాయకులు సోసైటీ డైరెక్టర్ తిరుమల ప్రభాకర్ రెడ్డి ఘన నివాళులు అర్పించారు .పింగళి వెంకయ్య తెలుగువారు కావడం మనందరికీ గర్వకారణం అన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయన పేరు గడించారన్నారు. దేశానికి,రాష్ట్రానికి పింగళి వెంకయ్య నిరుపమాన సేవలను ఈ సందర్భంగా స్మరించుకుందామని అన్నారు.

# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కళాశాలలో యాంటీ డ్రగ్స్, సైబర్ క్రైమ్ అవేర్నెస్ ప్రోగ్రాం




బయ్యారం,తోవ్వ,ఆగస్టు 2.

బయ్యారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్, సైబర్ క్రైమ్ అవేర్నెస్ ప్రోగ్రాం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తిరుపతి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను, సైబర్ క్రైమ్ మోసాల పట్ల అవగాహనతో పాటు అప్రమత్తంగా ఉండాలని విద్యార్థిని విద్యార్థులు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రాజమణి,ఎన్ఎస్ఎస్ పిఓకె సంతోష్,అధ్యాపకులు ఏవిఎన్ రాజు, కుమారస్వామి ,స్నేహ ,వెంకటలక్ష్మి,రాములు, బిక్షం,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ అమీనాబాద్ తనిఖీ

## వచ్చిన మోడల్ స్కూల్ స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్




**తొవ్వ, చెన్నారావుపేట, ఆగస్టు,02:** చెన్నరావుపేట మండలంలోని అమీనాబాద్ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో రాష్ట్ర మోడల్ స్కూల్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ శనివారం రోజున తనిఖీ చేపట్టారు ఇందులో భాగంగా మోడల్ స్కూల్ లో గల అన్ని ల్యాబ్ లను కెమిస్ట్రీ ల్యాబ్, బోటనీ జువాలజీ ల్యాబ్, ఫిజిక్స్ ల్యాబ్, మ్యాథమెటిక్స్ ల్యాబ్, లాంగ్వేజ్ ల్యాబ్,లైబ్రరీ, ఒకేషనల్ కు సంబంధించిన హెల్త్ కేర్ అండ్ బ్యూటీ అండ్ వెల్నెస్ సంబంధించిన ల్యాబ్స్, కంప్యూటర్ ల్యాబ్ ను సందర్శించారు అదేవిధంగా మధ్యాహ్న భోజన బియ్యం నిల్వ ఉన్న రూమును సందర్శించారు, ఎమర్జెన్సీ మెడికల్ రూమ్, తరగతులు జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు .ఈరోజు హాజరైన విద్యార్థిని విద్యార్థుల సంఖ్యను తెలుసుకున్నారు అదేవిధంగా ఉపాధ్యాయినీ ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విలువైన సలహాలను సూచనలను అందజేస్తూ రాబోయే రోజుల్లో మోడల్ స్కూల్స్ ను పటిష్టవంతం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల మీదే ఉన్నందున ఇంకా బాగా కష్టపడి మంచి ఫలితాలను సాధించి విద్యార్థుల సంఖ్యను పెంచుకునేలా చర్యలు చేపట్టాలని ప్రిన్సిపల్ సూచించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీమతి సిహెచ్ జ్యోతి మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు

# కేసముద్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల స్పాట్ అడ్మిషన్స్ జరుగుచున్నవి




**తొవ్వ,కేసముద్రం,ఆగస్టు 02:** కేసముద్రం పట్టణంలో నూతనంగా ప్రారంభమైన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రికల్ (ఈవి),ఎలక్ట్రానిక్స్ ( ఈఎంబి) బ్రాంచీలలో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ జరునట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ తెలియచేసినాం .దరఖాస్తులు తేదీ ఈ నెల 06 నుండీ 08 వరకు స్వీకరించబడును మరియు స్పాట్ అడ్మిషన్స్ తేదీ 08 నాడు ఉదయం 11.00 గంటలకు నిర్వహించబడునని తెలియచేసినారు.వివరాల కొరకు ప్రిన్సిపాల్: 8977222648, నర్సయ్య 9848664703,సురేష్ 9989173035 ను సంప్రదించగలరు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తెలిపినారు.

# క్రిమిసంహారక మందు తాగి మహిళా మృతి

**తొవ్వ,కేసముద్రం ,ఆగస్టు 02:** క్రిమిసంహారక మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వెంకటగిరి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్ రాజ్ తెలిపిన కథనం ప్రకారం వెంకటగిరి గ్రామానికి చెందిన మల్లూరి నర్సమ్మ(60) భర్త లక్ష్మయ్య వృత్తి వ్యవసాయం మృతురాలికి ఓ కొడుకు ఒక కూతురు ఉన్నారు నరసమ్మ గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతుంది .ఈ మేరకు ఆమెను పలుమార్లు హాస్పిటల్ లో చూపించిన ఆరోగ్యం కుదుట పడలేదు. ఈ నేపథ్యంలో ఆమె ఆరోగ్యం ఎప్పటికీ కుదుట పడదేమోనని తరచు బాధపడుతూ ఉన్న తరుణంలో శనివారం ఉదయం వ్యవసాయ భూమి వద్దకు



వెళ్లి క్రిమిసంహారక మందు తాగి ఇంటికి చేరుకుంది. అట్టి విషయాన్ని గమనించిన మృతురాలు నరసమ్మ కోడలు వెంటనే అదే గ్రామంలో ఉంటున్న నరసమ్మ అల్లుడికి ఫోన్ చేసి ఓ ప్రైవేటు వాహనంలో మహబూబాబాద్ తీసుకొని వెళ్తూ మార్గమధ్యలో 108 లో ఎక్కించి మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. మేరకు మృతురాలి కుమారుడు మల్లూరు యాకయ్య దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరిగిందని ఎస్సై తెలిపారు.

# బాలు తండాలో సీనియర్ బిఆర్ఎస్ నాయకుడు మృతి

## పూలమాలలు వేసి నివాళులర్పించిన బిఆర్ఎస్ నాయకులు



**తొవ్వ, ప్రతినిధి, ఖానాపూర్, ఆగస్టు, 02:** బాలు తండా గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తేజావత్ లచ్చిరాం వయసు 75 సంవత్సరాలు అనారోగ్యంతో మృతి చెందగా వారి భౌతికకాయాన్ని కి పూలమాలవేసి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన మాజీ మార్కెట్ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ మరియు మండల బీసీ సెల్ అధ్యక్షులు కోరే సుధాకర్ బాలు తండా గ్రామ పార్టీ అధ్యక్షులు మీసాల వీరన్న మాజీ సర్పంచ్ మంగ్యా నాయక్ బోడ వెంకన్న తేజవతు లచ్చు రాము రామకృష్ణ శంకర్ మరియు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

# పొద్దుటూరు గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలి

## సిపిఎం రాస్తారోకో

**యాదాద్రి జిల్లా :వలిగొండ: తొవ్వ ప్రతినిధి బీఆగస్టు 2**

పొద్దుటూరు ఏదుల్లగూడెం గ్రామాలకు చెందిన ప్రజల మరియు విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని వెంటనే కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు శనివారం రోజున భువనగిరి నల్గొండ రహదారి ఏదుళ్ళగూడెం స్టేజి వద్ద నిర్వహించిన రాస్తారోకో సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులకు పొద్దుటూరు ఏదుల్లగూడెం గ్రామాలకు బస్సు సౌకర్యాలని కల్పించాలని అనేకసార్లు విజ్ఞప్తులు చేసిన ఏమాత్రం పట్టించుకోవడంలేదని దీనిపై స్థానిక ఎమ్మెల్యే గారికి కూడా ప్రజలు విజ్ఞప్తి చేసిన నేటికీ బస్సు సౌకర్యం కల్పించలేదని వలిగొండ మండల కేంద్రానికి ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యను అభ్యసిస్తున్న అనేకమంది పేద విద్యార్థులు ప్రైవేటు వాహనాల్లో వందల రూపాయలు ఖర్చు చేసి ప్రయాణం చేయాల్సి వస్తుందని కొంతమంది డబ్బులు చెల్లించే స్తోమత లేక పొద్దుటూరు నుండి ఎదుల్లగూడెం స్టేజి వరకు నాలుగు కిలోమీటర్లు కాలినడకన వస్తున్నారని వీరితోపాటు భువనగిరికి మరియు ఇతర పనుల కోసం వెళ్లే అనేకమంది ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం ఆర్టీసీ అధికారులు స్థానిక ఎమ్మెల్యే గారు వెంటనే స్పందించి పొద్దుటూరు ఏదుళ్ళగూడెం గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు వారం రోజుల్లో



అధికారులు స్పందించని పక్షంలో ఇరు గ్రామాల ప్రజల్ని సమీకరించి భువనగిరి నల్గొండ రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు దుబ్బ లింగం, మండల నాయకులు భూమి బాల శంకర్, నాయకులు బత్తుల నరసింహ,పెద్ద బోయిన భీమరాజు, తాళ్ల రవి, గడ్డం సుదర్శన్,గ్రామస్తులు దుబ్బ సాయి, పెద్ద బోయిన రాము, దుబ్బ బాలస్వామి, జీలకపల్లి దుర్గయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చుక్కనీరు రాని తుంగబంధం కాలువ

## ఆవేదన వ్యక్తపరిచిన రైతులు

**తొవ్వ, ప్రతినిధి, ఖానాపూర్, ఆగస్టు, 02:** ఖానాపురం మండలం కొత్తూరు గ్రామం తుంగబంధం కాలువ కొత్తూరు టు ద్వారక పేటకు పోయే రేవు కాడ తుంగబంధం కాలువలు చుక్క నీళ్ళు రావడం లేదు రైతులు పొలాలు సాలు పెట్టి దమ్ము చేయడానికి చుక్క నీళ్లు రాకపోవడంతో ఎక్కడి పొలాలు అక్కడే నెర్రెలు పట్టి ఎండిపోవడం జరిగింది నారుమళ్ళకు కూడా నీళ్లు లేక ఎండ



తీవ్రతతో వాడిపోవడం జరిగింది .సముద్రం తలాపున పెట్టుకొని దూపకుఏడ్చినట్టుగా ఖానాపురం మండలంలో పాకాల చెరువు సుమారు 26 ఫీట్ల నీరు వర్షపు ఆధారంగా చెరువులో రావడం జరిగింది అయినప్పటికీ తుంగభంధం కాలువలో నీళ్లురాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పాలకులు గాని అధికారులు గాని ఎవరు కూడా రైతుల కష్టాన్ని అర్థం చేసుకోలేకపో తున్నారు రాజకీయ నాయకులు గాని అధికారులు కానీ తక్షణమే నీళ్లను విడుదల చేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# వృత్తి సమస్యల పరిష్కారం కోసం అమరవీరుల స్ఫూర్తితో గీత కార్మికులు ఉద్యమించాలి

## బొలగాని జయ రాములు - కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు



**యాదాద్రి జిల్లా :రామన్నపేట: తొవ్వ ప్రతినిధి :ఆగస్టు 02**

కల్లుగీత కార్మికుల సమస్యలపై నిరంతరం పనిచేసి తమ జీవితాలను త్యాగం చేసిన అమరవీరులను స్మరిస్తూ వారి స్ఫూర్తితో గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాల్సిన అవసరం కల్లు గీత కార్మికులకు ఉన్నదని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లా ప్రధాన కార్యదర్శి బోలగాని జయరాములు గీత కార్మిక సోదరులకు పిలుపునిచ్చారు.శనివారం రోజున రామన్నపేట పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ గెస్ట్ హౌస్ లో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆగస్టు 2 నుండి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా కల్లు గీత కార్మిక ఉద్యమము లో పనిచేసి అమరులైన అమరులను స్మరిస్తూ జరుపు అమరుల యాధిలో సామాజిక చైతన్య యాత్ర ను రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ప్రాంత కల్లు గీత కార్మిక ఉద్యమంలో కీలక భూమిక వహించిన అమరజీవి మునుకుంట్ల ఎల్లయ్య చిత్రపటానికి పూలమాలవేసి కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బోలగాని జయరాములు నివాళు లర్పిస్తూ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో బోలగాని జయరాములు మాట్లాడుతూ గీత కార్మికుల హక్కుల కోసం సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేసే మునుకుంట్ల ఎల్లయ్య మన మధ్యన లేకపోవడం చాలా బాధాకరమని వారి ఆశయ సాధన కోసం మనమంతా పనిచేయాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని, కల్లు గీత కార్మికుల సంక్షేమానికి 5000 కోట్ల రూపాయలు కేటాయిస్తూ ప్రతి కుటుంబానికి రెండు లక్షల రూపాయల ఆర్థిక సహకారం అందించాలని ప్రతి గీత కార్మికుడికి మోటార్ బైక్ ను అందించాలని. తాటి చెట్టు నుండి పడి మరణించిన వారికి శాశ్వత వికలాంగులకు పది లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని, జిల్లాలో పెండింగ్లో ఉన్న ఎక్స్గ్రేషియాలకు తక్షణమే నిధులు విడుదల చేసి బాదిత కుటుంబాలకు అందించాలని. వృత్తి చేస్తున్న ప్రతి గీత కార్మికుడికి సేఫ్టీమోకులు అందించాలని, గీత కార్మికులకు 4000 రూపాయల వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని. గీత కార్మికులు సహజ మరణం పొందిన 5 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా ఇచ్చే విధంగా గీతన్న బీమా పథకాన్ని వర్తింపచేయాలని.తాటి ఈత వనాల పెంపకం కోసం5 ఎకరాల భూమి కేటాయించాలని నీటి సౌకర్యం కల్పించాలని ప్రతి జిల్లా మండల కేంద్రంలో నీరా దుకాణాలు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బావండ్లపల్లి బాలరాజు, మండల అధ్యక్షులు ఎర్ర రవీందర్, జిల్లా నాయకులు కూనూరు మల్లేశం, మండల కోశాధికారి మునుకుట్ల లెనిన్, కూనూరు శ్రీనివాస్, భూపతి నరసింహ, బావండ్లపల్లి సత్యం, గోపగోని శంకరయ్య, వీరమల్ల ముత్తయ్య, అంతటి మల్లేశ%శీ%, ఎర్ర మల్లేష్,ఎర్ర సత్తయ్య, బాలగోని నరసింహ, రామ లక్ష్మయ్య, బొడిగె రమేష్, వీరమల్ల ముత్తయ్య, దంతూరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ జిల్లా నాయకుని

# పుట్టినరోజు వేడుకలు

### గ్రామ యూత్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్,

### గ్రామ సీనియర్ నాయకులు బుడిగ లక్ష్మయ్య,

**తొవ్వా న్యూస్ ప్రతినిధి కురవి ఆగస్టు 2,**

బిఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి పుట్టినరోజు వేడుకలను గ్రామ సీనియర్ నాయకులు బుడిగ లక్ష్మయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం మండలంలోని అయ్యగారి పల్లి గ్రామంలో కేక్ కట్ చేసి పిచ్చిరెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా క్షేత్రంలో పది కాలాలపాటు చల్లగా ఉంటూ ప్రజలకు గ్రామానికి అభివృద్ధి పనులు చేసే విధంగా ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లమూడి శ్రీనివాస్ చారి. సోమనబోయిన లక్ష్మణ్. బుడిగ మధు. నరసింగం వెంకన్న. వడ్లకొండ వీరమల్లు. వడ్లకొండ రాములు. బజ్జూరి పూర్ణచందర్ రెడ్డి. భూపాల్ రెడ్డి. బుడుగ నరేష్. దూదిమట్ల దేవేందర్. అక్కినపల్లి మహేష్. నరగం అశోక్. కృష్ణ. కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## 'చెప్పు తెగుద్ది'..

### అభిమానులపై ఫైర్ అయిన అనసూయ.. వీడియో

టాలీవుడ్ నటి, యాంకర్ అనసూయ కొందరు యువకులకు అసభ్య కామెంట్లు చేస్తే చెప్పు తెగుద్ది అంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా మార్కపూరంలోని ఓ షాపింగ్‌మాల్ ఓపెనింగ్‌లో భాగంగా అక్కడికి వెళ్లిన అనసూయని కొందరు ఆకతాయిలు కామెంట్లు చేయడం మొదలుపెట్టారు. దీంతో అనసూయ వారికి గట్టిగా వార్నింగ్ ఇచ్చింది. చెప్పు తెగుద్ది.. మీ ఇంట్లో అమ్మ, చెల్లి, భార్య కుటుంబసభ్యులను ఇలాగే కామెంట్లు చేస్తే ఊరుకుంటారా. పెద్దవాళ్లకి మర్యాద ఇవ్వడం మీ ఇంట్లో నేర్పలేదా అంటూ అనసూయ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

## ఎన్టీఆర్ అన్న కోసం ఆ సినిమా టైటిల్ మార్చుకున్నాం : విజయ్ దేవరకొండ



టాలీవుడ్ అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ చాలా రోజుల తర్వాత కింగ్‌డమ్ సినిమాతో సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్నాడు. ఈ సినిమాకు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం నాగవంశీ నిర్మించాడు. గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం పాజిటివ్ టాక్‌తో రన్ అవుతుంది. అయితే ఈ సినిమా టైటిల్‌పై ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు విజయ్. ఈ సినిమాకు మొదటగా నాగదేవర 'నాగ దేవర' అనే టైటిల్ అనుకున్నామని అయితే అప్పటికే ఎన్టీఆర్ అన్నా దేవర ప్రకటించడంతో ఈ టైటిల్ వదులుకున్నట్లు విజయ్ చెప్పుకోచ్చాడు.

## బకాసుర రెస్టారెంట్'

## నవ్వులు పంచే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్!




వినోదంతో పాటు ఎమోషన్‌ను మేళవించి, ప్రేక్షకులను రెండున్నర గంటలు ఎంటర్‌టైన్ చేయడమే ధ్యేయంగా రూపొందిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. ఈ సినిమా చూసిన వారికి ఓ మంచి విందు భోజనం ఆరగించిన ఫీల్ కలుగుతుందని చిత్రబృందం చెబు తోంది. తన నటనతో, డైలాగ్ డెలివరీతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న క్యారెక్టర్ ఆర్టిస్ట్, కమెడియన్ ప్రవీణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రమిది. ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. కృష్ణభగవాన్, షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్ ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.



## షారూఖ్ ఖాన్‌కి నేషనల్ అవార్డ్..

### అల్లు అర్జున్ క్రేజీ రియాక్షన్



శుక్రవారం సాయంత్రం 71వ జాతీయ అవార్డులు ప్రకటించగా, ఇందులో తెలుగు సినిమాలు కూతా సత్తా చాటాయి. వివిధ విభాగాల్లో పలు తెలుగు చిత్రాలు, కళాకారులు అవార్డులను సొంతం చేసుకున్నారు. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'భగవంత్ కేసరి' అవార్డు గెలుచుకుంది.ఉత్తమ యాక్షన్ డైరెక్షన్ కేటగిరిలో 'హనుమాన్' చిత్రం ఎంపికైంది. ఉత్తమ బాలనటిగా డైరెక్టర్ సుకుమార్ కుమార్తె సుకృతివేణి (గాంధీ తాత చేటు) ఎంపికయ్యింది. ఉత్తమ గీత రచయిత అవార్డు 'బలగం' సినిమాకు దక్కింది . ఉత్తమ స్క్రీన్ ప్లే రైటర్ అవార్డు 'బేబీ' సినిమాకు గాను సాయి రాజేష్ కు గౌరవం దక్కింది. ఉత్తమ గాయకుడిగా పీవీఎన్ఎస్ రోహిత్ (ప్రేమిస్తున్నా పాట) ఎంపికయ్యారు.

### ఏది ఏమైన నేను అతన్నే

## పెళ్లి చేసుకుంటా..

### అనుష్క శెట్టి క్లారిటీ

20 ఏళ్లుగా దక్షిణాది సినీ పరిశ్రమలో తనదైన స్థానాన్ని సంపాదించుకున్న అగ్రహీరోయిన్ అనుష్క శెట్టి ఇప్పటికీ టాప్ లీగ్‌లో కొనసాగుతోంది. అనుష్క తర్వాత ఇండస్ట్రీలోకి వచ్చిన చాలా మంది హీరోయిన్‌లు ఇప్పటికే పెళ్లి చేసుకుని కుటుంబ జీవితంలోకి అడుగుపెట్టినప్పటికీ, స్వీటి మాత్రం తనకు నచ్చిన దారిలో సాగుతూ కెరీర్‌ను కొనసాగిస్తోంది. 2005లో నాగార్జున హీరోగా నటించిన 'సూపర్' సినిమా ద్వారా వెండితెరపై అరంగేట్రం చేసిన అనుష్క, తన అందంతో, అభినయంతో తక్కువ సమయంలోనే ప్రేక్షకులను ఆకట్టుకుంది. క్లాస్, మాస్ తేడా లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయింది. స్టార్ హీరోలందరితో కలిసి హిట్టైన సినిమాలు చేసింది.

Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146